సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

వైద్య సిబ్బంది సంగతేంటి..?

- ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో నేడు నూతన విభాగాల ప్రారంభం
- నేటికీ కానరాని సిబ్బంది నియామకం
- ఇప్పటికే స్టాఫ్ నర్సుల కొరత
- కొత్త బ్లాక్‌లతో మరింత పనిభారం

బీచ్‌రోడ్డు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి ఇచ్చిన ప్రాధాన్యం రాష్ట్ర ప్రజలు మరువలేనది. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం విలేజ్ క్లినిక్‌ల నుంచి రాష్ట్ర స్థాయి ఆస్పత్రుల వరకు ఎంతో బలోపేతం చేశారు. నూతన ఆస్పత్రుల నిర్మాణం, పెద్ద సంఖ్యలో వైద్య సిబ్బంది నియామకం చేపట్టారు. ప్రభుత్వ వైద్యశాలలను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు కొత్త విభాగాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో రూ.28.60 కోట్లతో పిల్లలు, వృద్ధుల మానసిక చికిత్స, పునరావాస విభాగం, వ్యసన విముక్తి విభాగాలను నిర్మించారు. ఈ మూడు బ్లాక్‌ల్లో సిబ్బందిని నియమించేందుకు గతంలో నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికలు రావడం.. నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆ నోటిఫికేషన్‌కు బ్రేక్ పడింది. ప్రత్యేకమైన వైద్యం అందించే విభాగాలకు నిపుణులైన వైద్యులు, సిబ్బంది లేకుండానే శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వాటిని ప్రారంభించనున్నారు. దీంతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గత ప్రభుత్వంలో నోటిఫికేషన్ జారీ

ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 140, 141 జీవోల ద్వారా అనేక నోటిఫికేషన్లు జారీ చేసింది. చాలా వరకు ఉద్యోగాలను భర్తీ చేశారు. కీలకమైన స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ విషయంలో అప్పటి ఆస్పత్రి ఉన్నతాధికారులు జాప్యం చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ కె.రామిరెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పెద్ద సంఖ్యలో అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కూడా వచ్చాయి. మెరిట్ లిస్ట్‌ను కూడా ఆస్పత్రి ఉన్నతాధికారులు సిద్ధం చేశారు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయింది.


పెదవాల్తేరులోని ప్రభుత్వ మానసిక వైద్యశాల

సిబ్బంది కొరతతో ఇబ్బందులు

300 బెడ్లతో ఉన్న మానసిక ఆస్పత్రిలో ఇప్పుడు అదనంగా మరో 80 బెడ్లు అందుబాటులోకి రానున్నాయి. ఇక్కడ 300 బెడ్లకు సరిపడే సిబ్బంది లేక ప్రస్తుతం పనిచేస్తున్న వైద్యులు, స్టాఫ్ నర్సులపై తీవ్ర పనిభారం పడింది. వారికి ఈ అదనపు విభాగాలు మరింతగా పని ఒత్తిడిని తీసుకురానున్నాయి. ముఖ్యంగా స్టాఫ్ నర్సుల కొరత మానసిక ఆస్పత్రిని తీవ్రంగా వేధిస్తోంది. రోగులు వందల సంఖ్యలో ఉంటే వారికి సేవలందించే సిబ్బంది మాత్రం పదుల సంఖ్యలో ఉండటంతో పనిభారం పెరుగుతోంది. కేవలం 42 మంది స్టాఫ్ నర్సులు మాత్రమే ఉండటంతో వారు పని ఒత్తిడికి గురవుతున్నారు.

నూతన విభాగాలకు సిబ్బంది శూన్యం

80 బెడ్లతో కూడిన మూడు నూతన విభాగాలను శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ప్రారంభించనున్నారు. వీటికి ఎటువంటి సిబ్బందిని నియమించకుండానే ఈ కార్యక్రమం చేపడుతున్నారు. ఈ విభాగాలకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన చిన్న పిల్లల మానసిక వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది చాలా అవసరం. అప్పుడే రోగులకు మెరుగైన వైద్యం అందేందుకు వీలుంటుంది. వైద్య నిపుణులతోపాటు పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించలేదు.

ఆస్పత్రి వైద్యుల ఎదురుచూపులు

నోటిఫికేషన్ ప్రక్రియను పునఃప్రారంభించి వైద్య సిబ్బందిని నియమించాలని ఉన్నతాధికారులకు ఆస్పత్రి అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అప్పటి వరకు ఇతర ఆస్పత్రుల్లో అధికంగా ఉన్న స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బందిని ఇక్కడ సర్దుబాటు చేయాలని కోరుతున్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వస్తున్న నేపథ్యంలో ఆయన దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించుకోవాలనే ఆశతో మానసిక ఆస్పత్రి వైద్యులు ఎదురు చూస్తున్నారు.

ఆడిపాడిన చిన్నారులు


వీఎంఆర్‌డీఏ పార్క్‌లో ఏనుగు బొమ్మల వద్ద ఫొటో తీసుకుంటున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు శుక్రవారం బీచ్ రోడ్డులోని వీఎంఆర్‌డీఏ పార్క్‌ను సందర్శించారు. ఎల్‌కేజీ, ఒకటి, రెండో తరగతుల పిల్లలు పిక్నిక్‌కు వచ్చారు. ఏనుగు బొమ్మలు, ఆట పరికరాల వద్ద ఫొటోలు దిగారు. ఆటపాటల్లో మునిగితేలారు. మధ్యాహ్నం భోజనాలు చేశారు. సుమారు ఐదారు వందల మంది చిన్నారులు పార్క్‌లో రోజంతా సందడి చేశారు.

జోన్-3 కార్యాలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

సీతమ్మధార: ఆశీలమెట్ట అశోక్‌నగర్‌లో గల జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. కొద్ది రోజులుగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇక్కడి కార్యాలయంలోని జీ+2 అంతస్తులో పలు విభాగాలు ఉన్నాయి. వాటితో పాటు మొత్తం 31 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని జోనల్‌కమిషనర్ కె.శివప్రసాద్ శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. ఈ కార్యాలయానికి తూర్పు, ఉత్తర నియోజకవర్గం (పార్టు) పరిధిలోని ప్రజలు పలు పనుల నిమిత్తం వస్తుంటారు.

క్లుప్తంగా

పద్మావతి పుష్పయాగానికి విశాఖ నుంచి పువ్వులు


వివిధ రకాల పుష్పాలకు సంకలనం చేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: తిరుమల పద్మావతి అమ్మవారి పుష్పయాగానికి విశాఖ నుంచి పువ్వులు తరలి వెళ్లాయి. ఆధ్యాత్మిక వేత్త హిమాంశు ప్రసాద్, కార్తీక దీపోత్సవం టీమ్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలలో సేకరించిన పువ్వులను శుక్రవారం ఎంవీపీలోని టీటీడీ ఈ-దర్శనం కౌంటర్ వద్ద భక్తుల సమక్షంలో వేదపండితులు సంకలనం నిర్వహించారు. తిరుమలలో జరుగుతున్న పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే పుష్పయాగానికి ఈ పువ్వులు తరలిస్తున్నట్లు హిమాంశు ప్రసాద్ ఈ సందర్భంగా వెల్లడించారు. 4 వేల కలువలు, 2 వేల తామర పువ్వులు సేకరించామన్నారు.

అయ్యప్ప స్వాముల సైకిల్ యాత్ర


శబరిమలకు సైకిల్ యాత్ర ప్రారంభిస్తున్న అయ్యప్ప మాలధారులు

ఆరిలోవ: ఆరిలోవ నుంచి నలుగురు అయ్యప్ప స్వాములు శబరిమలకు సైకిల్ యాత్ర చేపట్టారు. గంగాధర్ గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5.30 గంటలకు ఆరిలోవ ఆఖరి బస్టాప్ వద్ద పోలమాంబ అమ్మవారి ఆలయంలో పూజలు చేసి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర 18 రోజులు పాటు జరగనుందని గంగాధర్ తెలిపారు. విశాఖ నుంచి విజయవాడ, తిరుపతి, చిదంబరం మీదుగా కుంభకోణం, కోయంబత్తూరు, ఎర్నాకులం, పంబ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం


తిరువీధి ఉత్సవంలో అయ్యప్ప స్వాములు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక వద్ద భక్త తుకారాం ఆలయంలో శ్రీరామ అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో అయ్యప్ప పూజలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అయ్యప్ప స్వాములు తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో లక్ష్మీగణపతి పూజలు చేసిన అనంతరం కేరళ మంగళ వాయిద్యాలతో అయ్యప్పను పల్లకీలో ఊరేగించారు. హనుమంతవాక నుంచి కైలాసగిరి కూడలి, రెవెన్యూ కాలనీ మీదుగా భక్త తుకారాం ఆలయం వరకు అయ్యప్ప కీర్తనలు, పాటలతో తిరువీధి సాగింది. అనంతరం 108 కలశాల జలంతో స్వామికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి


మొక్కల విశేషాలు తెలుసుకుంటున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: ఉక్కు నగరానికి చెందిన ఒక ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వారికి పార్క్ పర్యవేక్షకుడు రామ మూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. పార్కులో రోజంతా విద్యార్థులంతా సందడి చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ అనీష్, మాధ్యూ, భానుమతి పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

హిందీపై పట్టుతో విస్తృత అవకాశాలు

ఎంవీపీకాలనీ: హిందీ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని అవధీ సాహిత్య సంస్థాన్(ఉత్తర ప్రదేశ్) కార్యదర్శి డాక్టర్ శివమ్ తివారీ సూచించారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రీ విద్యాపరిషత్ కళాశాలలో 'హిందీ భాష ద్వారా సరికొత్త అవకాశాలు-ఉపాధి' అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రధాన వక్తగా మాట్లాడారు. హిందీపై పట్టు సాధించడం ద్వారా దేశవ్యాప్తంగా విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. తద్వారా ఉన్నత ఉద్యోగులుగా, వ్యాఖ్యాతలుగా, పత్రికా ప్రచార సాధకులుగా అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అనంతరం డాక్టర్ శివమ్‌ను కళాశాల ప్రతినిధులు సత్కరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్, యూజీ కోర్సుల డైరెక్టర్ డి.గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ శివమ్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ఎంవీపీకాలనీ: ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ రిటైర్డ్ అధికారి చల్లా మంజుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎంవీపీ కాలనీలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గతంలో మంజుల అత్యధిక సంఖ్యలో క్రోచెట్ స్క్వేర్‌లను తయారు చేసినందుకు గాను గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. క్రోచెట్ స్క్వేర్‌లతో దుప్పట్లు తయారు చేసి వృద్ధులకు, పేదలకు అందించారు. తాను సాధించిన రికార్డు ఉత్పత్తులను మానవతా కార్యక్రమానికి ఉపయోగించడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. క్రోచెట్ స్క్వేర్‌లతో రంగు రంగుల దుప్పట్లను కుట్టి, చలితో బాధపడుతున్న వారికి మా ప్రేమ ఎన్జీవో ఆధ్వర్యంలో అందించడంపై పలువురు మంజులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణవీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు దుప్పట్లు అందిస్తున్న చల్లా మంజుల

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని, వారి విధులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు హామీ ఇచ్చారని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఆల్ ఇండియా పబ్లిక్ బస్ ట్రాన్స్‌పోర్ట్ అథ్లెటిక్ మీట్ ప్రారంభోత్సవానికి విశాఖ వచ్చిన చైర్మన్ నారాయణరావు, ఏపీడీబజీ ఆర్టీసీ ఎండీ సిహెచ్.ద్వారకా తిరుమలరావు, విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్ ఎస్.దొన్నుదొర, ఏఎస్ఆర్టీయూ ఈడీ టి.సునీల్‌కుమార్‌లను కైలాసగిరి వద్ద గల పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అథ్లెటిక్ మీట్‌లో ఆయన మర్యాదపూర్వకంగా కలిసి అసోసియేషన్ తరఫున ఘనంగా సత్కరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు స్పోర్ట్ మీట్ ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, విజయనగరం జోన్-1 ఇన్‌చార్జి కార్యదర్శి బి.ఎస్.రాములు, విశాఖ జిల్లా అధ్యక్షుడు జి.రామకృష్ణ, రీజినల్ కార్యదర్శి బి.నీలకంఠం, డివిజన్ కార్యదర్శి ఎ.కె.శివాజీ, రీజినల్ జాయింట్ సెక్రటరీ కె.ఎస్.ఎన్.మూర్తి, జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


నారాయణరావు, దొన్నుదొరలను సత్కరిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్ ప్రొగ్రాంకు ఏయూ విద్యార్థి

విశాఖ విద్య: నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ నిర్వహించే వింటర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం-2024కు ఆంధ్ర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ విభాగం ఫస్టియర్ విద్యార్థి వన్నల ప్రేమ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శుక్రవారం ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ప్రేమ్‌కుమార్‌ను అభినందించి ఇంటర్న్‌షిప్ ఉత్తర్వులను అందించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు విద్యార్థికి శుభాకాంక్షలు తెలిపారు. పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య పి.ప్రేమానందం మాట్లాడుతూ రాష్ట్రం నుంచి కేవలం ఒకే విద్యార్థి జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్ ప్రొగ్రాంకు ఎంపిక కావటం, అదికూడా తమ విభాగానికి చెందిన విద్యార్థికి అవకాశం దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 10 వరకు దేశ రాజధాని ఢిల్లీలో జాతీయ స్థాయి ఇంటర్న్‌షిప్ ప్రొగ్రాం జరగనుందని తెలిపారు. డా.కె.సత్యనారాయణ, డా.ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రేమ్‌కుమార్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

ఆకట్టుకున్న రాయ, బంధనం నాటికలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ కళాభారతిలో శుక్రవారం రెండు నాటికల ప్రదర్శించారు. బంధనం, రాయ నాటికలు అందర్నీ అబ్బుర పరిచాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఈ ప్రదర్శనలను వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్. గుమ్ములూరి రాంబాబు, వేణు, గెద్ద వరప్రసాద్, నాంచారయ్యలు ప్రారంభించారు. అనంతరం మొదటి ప్రదర్శనగా విజయనగరానికి చెందిన నాటకశాల నటసేవా సమాజం వారిచే 'రాయ', 'బంధనం' నాటికలు అద్భుతంగా ప్రదర్శించారు. సమాజంలో దోచుకుంటున్న ధనవంతులపై పేదలు ఎదురుతిరిగితే ఏం జరుగుతుంతో కథాంశంతో రాయ రూపుదిద్దుకుంది. బంధనం నాటిక కూడా ఆలోజింపజేసింది. పిల్లల పెద్దవాళ్లు అయ్యాక తల్లిదండ్రులను సరిగ్గా చూసుకోకపోవడం నేటి సమాజంలో తరచూ చూస్తున్నాం. ఇదే అంశంతో బంధనం నాటిక రూపుదిద్దుకుంది. బంధాలు విలువ చాటి చెప్పేలా నాటిక సాగింది. ప్రముఖ సినీ నటుడు గెద్దా వరప్రసాద్ దర్శకత్వంలో రెండు నాటికలు అత్యంత వైభవంగా ప్రదర్శించారు. అంతకు ముందు ఇటీవల మృతి చెందిన బాదంగీర్ సాయికి కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కళాకారులు నివాళులర్పించారు.


బంధనం నాటికలో సన్నివేశం

మహనీయుడు అంబేడ్కర్


ఆరిలోవలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి
- వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు

ఆరిలోవ: నియోజకవర్గంలో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 12వ వార్డు ఆరిలోవ అంబేడ్కర్ కూడలిలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్వాహకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహనీయుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, డీవీఎంసీ సభ్యుడు అల్లంపల్లి రాజబాబు, మోహనరావు, బాబూరావు, కిరణ్, చంద్రరావు, సత్యనారాయణ, శ్రీరాములు, సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ తొమ్మిదో వార్డులో పలుచోట్ల టీడీపీ నాయకులు, స్థానిక పెద్దలు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు జరిపారు. నాయకులు వేజెల్ల సుబ్బరాజు, అక్కరబోయిన రాంబాబు, నాగరాజు, నూకరాజు, భారతి తదితరులు స్థానికులతో కలిసి ఎస్టీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. పెదగదిలి కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకులు, స్థానికులు నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, గడి సత్యం తదితరులు పాల్గొన్నారు.
- 10వ వార్డు బి.ఎస్.ఆర్.నగర్‌లో అంబేడ్కర్‌కు టీడీపీ నాయకులు, స్థానికులు నివాళులర్పించారు. బలగ సుధాకర్, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ వేషధారణలో అలరించిన విద్యార్థి

జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ముఖ్య అతిథి చినగదిలి ఎంఈవో రవీంద్రబాబు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. నాలుగో తరగతి విద్యార్థి ముజ్మల్ అంబేడ్కర్ వేషధారణలో అలరించాడు. ఉపాధ్యాయులు ఆ బాలుడిని అచ్చం అంబేడ్కర్‌ను గుర్తుచేసేలా ముస్తాబు చేశారు. బాబా సాహెబ్ వేషధారణలో హావభావాలు ప్రదర్శించి ఆకట్టుకున్న ముజ్మల్‌ను ఎంఈవో రవీంద్రబాబు అభినందించారు. ఇటువంటి ప్రయత్నాలు పిల్లల్లో ఉత్సాహాన్ని పెంచుతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈవో రవీంద్రబాబు, ఉపాధ్యాయులు


బాబా సాహెబ్ అంబేడ్కర్ వేషధారణలో సంతపాలెం పాఠశాల విద్యార్థి ముజ్మల్

బడుగుల ఆశాజ్యోతి అంబేడ్కర్

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి

విశాఖ విద్య: అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. రిజిస్ట్రార్ ధనుంజయరావు, వివిధ విభాగాధిపతులతో కలిసి ఏయూ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆచార్యులు, ఉద్యోగులు, పరిశోధకులు పుష్పాంజలి అర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సీతామాణిక్యం, ఎం.వి.ఆర్.రాజు, డి.నాగరాజకుమారి, ఆర్.పద్మశ్రీ, జి.గిరిజాశంకర్, ఎస్.విజయ మోహన్, ఎస్సీ ఎస్టీ బీసీ-సీ టీచర్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య టి.షారోన్ రాజు తదితరులు పాల్గొన్నారు.


రామ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పల్లా దుర్గారావు


ఏయూలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు


ఇగ్నోలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మారావు తదితరులు

లా కాలేజీ ఆధ్వర్యంలో..

ఏయూ న్యాయ కళాశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పూలమాల వేసి నివాళి అర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీతామాణిక్యం, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇగ్నో కార్యాలయంలో..

ఎంవీపీకాలనీ: ఉషోదయ కాలనీలోని ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం విశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఇగ్నో డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సిద్ధాంతాలను నేటి యువత ఆచరణలో పెట్టాలన్నారు. పలువురు ఇగ్నో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరిలోవ పోలీస్ స్టేషన్ ప్రారంభానికి సన్నాహాలు

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. కొత్త పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభానికి పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో సుమారు ఎకరం స్థలంలో 1000 చదరపు గజాల విస్తీర్ణంలో భవనం నిర్మించిన విషయం విదితమే. ఈ నెల 8న పోలీస్ స్టేషన్ ప్రారంభించడానికి అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. శుక్రవారం ద్వారకా అధికారులు, ఆరిలోవ పోలీసులు ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. దీన్ని రాష్ట్ర హోం మంత్రి అనిత, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇరుకు గదిలో నిర్వహిస్తున్న ఆరిలోవ పీఎస్‌కు మోక్షం లభించనుంది.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని వినతి

మద్దిలపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శాఖ తొలగించిన 1,200 మంది హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని టీఎన్‌టీయూసీ-తెలుగునాడు వైద్య శాఖ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచార్యులు కోరారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ హైకోర్టు తీర్పును ఆసరాగా చేసుకొని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న 1,200 మందిని గడువు లోపే తొలగించడం అమానుషమన్నారు. సీఎం చంద్రబాబు దృష్టి సారించి నడి వయసులో ఉద్యోగాలు కోల్పోయిన హెల్త్ అసిస్టెంట్లకు న్యాయం చేయాలని ఆయన కోరారు. తమను విధుల్లోకి తీసుకొని ఆదుకోవాలని హెల్త్ అసిస్టెంట్లు అందరూ వేడుకున్నారు.

విజయవంతంగా అన్నప్రసాద వితరణ


అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం గౌరీ జ్ఞానలింగేశ్వరాలయ సముదాయంలోని శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో 41 రోజుల పాటు నిర్వహించిన అయ్యప్ప అన్నదాన కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో వేలాదిగా మాలధారులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన గ్రామస్తులు, దాతలు, మహిళా సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9010133346
Office mail : sakshiadvtvsp@gmail.com